# వింత సంఘము

శ్రీ ఎస్. వెంకటరమణ

అప్పుడే రైలుకూత వినిపించింది. తన మొదటి గ్రంథాన్ని అచ్చుచేయిస్తామని Publisher అప్పుడప్పుడే కవిత్వము మొదలు పెట్టిన కవికి ఎంత వుత్సాహమిస్తుందో అంతకు వెయ్యిరెట్లుగా వుత్సాహము కనబడింది తోడి ప్రయాణీకుల మొఖాల్లో. అప్పటికే 1 గం॥ పడివుంది రైలు అక్కడ. మృత్యుముఖము వాతపడ్డ మానవునికి కనిపించిన ఆశలా అనిపించింది ఆ రైలు కూత ప్రయాణీకులకు. ఆ స్టేషన్‌లోనే సుమారు 20 సం॥ స్త్రీ ఎక్కింది మా పెట్టిలో. ఆమె ముఖములో నిరాశ జ్యోతి తాండవిస్తున్నది. అంత చిన్నవయస్సులోనే ఎన్నో కష్టాలు అనుభవించినట్లుంది. ప్లాట్‌ఫారమ్‌మీద ఇంకా ఎవరెవరో వారి బంధువులు వచ్చినట్లుంది. ఆ గంటసేపు ఆమెతో మాట్లాడి ఎంతగనో విలపిస్తున్నారు. బండి కదులుతూవుండగా "అమ్మా జాగ్రత్త" అని ఎంతో విలపిస్తూ చెప్పారు. బండి సాగిపోతూవున్నది కాని ఆమె ఇంకా ఏడుస్తూవున్నది. ఆ కంపార్ట్‌మెంట్‌లో వున్న ముసలి డాక్టరు "ఏమమ్మా అలా విచారిస్తున్నారు" అన్నాడు. "మా అత్త గారింటికి పోతున్నానండి" అంది. "దానికింతగా విచారించవలెనా? ప్రతి స్త్రీ భారత దేశములో పుట్టే అత్తవారిల్లేకదా నివాస స్థలము" అన్నాడు తాత్వికంగా ముసలి డాక్టరు. నాకు చురుక మండింది. మన తోటి జీవి అలాంటి దుఃఖస్థితిలో వుంటే అలాగేనా ఓదార్చేది. వెంటనే ఆమె "మీకు ఏమి తెలుస్తుంది! క్షమించండి మీకు పుత్రికలు లేరేమో – వున్న మీరంతగా పట్టించుకోరేమో. కాని నావిషయము అది కాదు" అంటుండగా పేపర్లు చదువుకుండేవాళ్ళు, పత్రికలు చదువుకుండే వాళ్ళు, పరధ్యానముగా వుండేవాళ్ళంతా ఆతురతగా వినడము మొదలు పెట్టారు. ఆమె ఇలా చెప్పడము మొదలుపెట్టింది. "మా తల్లి తండ్రులకు నేను ఒక్కర్తెనే కుమార్తెను. మా తల్లిదండ్రులు నేను పుట్టకముందు చెట్టుకు గుట్టకు మొక్కుకున్నారు. నన్నెంతో అల్లారు ముద్దుగా పెంచుకొన్నారు. పదమూడో సంవత్సరము నుంచి పెండ్లి ప్రయత్నాలు చేశారు. మేము వ్యవసాయము చేసుకొంటూ ఆనందంగా వెళ్ళబుచ్చేవాళ్ళం. కాని అలా ఎప్పుడూ జరుగుతుందా చెప్పండి తాతగారు. పదిహేనోయేట నాకు వివాహమయింది. అనుకున్న ప్రకారము నన్నువిడచి వుండలేక మా తల్లితండ్రులు అల్లుణ్ని ఇంట్లోనే వుంచుకొన్నారు. మా ఇద్దరినీ చూచుకొని ఎంతగనో ఆనందించారు. కాని ఆ ఆనందము

ఎంతో కాలము నిలువలేదు. వాళ్ళ ఊళ్ళో వుండాలని రెండు సంవత్సరాలు తిరిగేలోగా వాళ్ళ ఇంటికి వెళ్ళిపోయారు. మాతండ్రి వాళ్ళ కాళ్ళు గడ్డాలు పట్టుకొని బతిమిలాడారు. కాని లాభములేకపోయింది. కాబట్టి నన్ను పంపించడానికి సిద్ధపడ్డారు. కాని ఆ ఆలోచనతోనే మా తల్లి మంచము ఎక్కింది. నాకు ఏమిచేయడానికి తోచలేదు. ప్రాణానికి ప్రాణమివ్వడానికి సిద్ధమయ్యేట్టి తన జీవితము యొక్క సర్వము నేనని తలచుకొన్న మా తల్లిని వదలి పోవడమా వద్దా ? అన్ని విధాలుగా ఆలోచించాను. ప్రపంచములో ఎంతమంది స్త్రీలు అత్తవారింటికి పోవడములేదు. వారి తోబుట్టువులను స్నేహితులను ఎంతో ఆనందాన్ని హాయిని కలిపించె ఎన్నో వస్తువులను వాళ్ళగ్రామములో వదలి ఎక్కడ ఎక్కడకో వెళ్ళిపోతారే వాళ్లమాట ఎవరన్నా అనుకొన్నారా. నిజంగా ఎంత స్వార్థపరులు మానవులు! ఆస్తి కోసము ధనముకోసము వివాహము చేసుకోడము ఎంత అవినీతికరము! ఎంత అన్యాయము! '' నాకు పిచ్చి ఎత్తినట్లు అయింది ఆ మాటలు వింటుంటే. ఇవన్నీ మనము రోజుచూచే విషయాలే వినేవిషయాలేకదా ? పైగా ఎవరయినా స్త్రీ స్వాతంత్ర్యమంటూ మాట్లాడితే 'బయలు దేరారు పెద్ద సంస్కర్తలు' అంటారు, శాస్త్ర సంబంధమైన 20 వ శతాబ్దములోని నవీనయువకులు. ఆమె ఇలా చెప్పడము ప్రారంభించింది. '' స్త్రీ స్వాతంత్ర్యమంటూ ఉపన్యాసాలు ఇస్తూ పత్రికలకు వ్యాసాలు వ్రాసిన వారిలో ఒకరు మావారు. కాని ఏమిలాభము 'ఇంటగెల్చి రచ్చగెలువు' అన్నట్లు వారి విషయాల్లోనే వారి సిద్ధాంతములను అమలులోబెట్టుకోలేక ఏమిచేస్తే ముట్టుకు రాణిస్తుంది. నాకు ఎంత భాద్యతో వారికి అంతేకదా ? పైగా మేము ప్రాధేయపడ్డా జవాబు చెప్పలేదు. ఎందుకా B. A. చదువులు? అలాగే ఈ రెండు సంవత్సరాలు మాకుటుంబములో ఎన్నో కలతలు బయలుదేరాయి. ఆనందము మాయమయింది. ఈ భారతదేశములో అందరి స్త్రీలలాగే అత్తవారింటికి పంపించడానికి నిశ్చయించుకొన్నారు మా వాళ్లు. మాతండ్రి ఎన్నో మాఱులు మా అత్తగారింటికి పోయినారు. ఎంత ఆడపిల్ల తండ్రి అయినా సంస్కారము తెలిసి సంఘములో వుంటే ప్రతి మానవుడు తోడి మానవుణ్ని ప్రేమించడము గౌరవించడము నేర్చుకోవద్దా ? కాని మా తండ్రిని ఎంతో హీనంగా చూశారు. అలాంటి మహనీయులు ఎంత మందో వున్నారు ఈ నాటి సంఘములో. ఆడపిల్లలతండ్రి అంటే వినయ విధేయతలు వుండాలగాని వాటిని అవకాశముగా తీసుకొని అగౌరించడము ఎంత నీచము. కన్న కడుపు అంటే ఏమిటో వాత్సల్యమేమిటో నేను అర్ధము చేసుకొన్నాను. ఈ 20 సం||లు

నా జీవితాన్ని స్వర్గతుల్యంగా చేసుకొన్నాను. ఇంక ఎలా అవుతుందో'' అంది దీనంగా. ముసలి డాక్టరు ''ఎవ్వరు నీ వెంట రావడము లేదా?'' అన్నాడు. ఆమె ''వాళ్ళ గడప మేము తొక్కము మా గడపవాళ్ళు తొక్కడము మానేసి సంవత్సరమయింది. నేను చుట్టూ అవరించిన వింతకూతలతో కూడిన భయంకర జంతువులవలే వున్న ఈ సంఘానికి భయపడి పోతున్నా'' నంది. ఇంతలో డాక్టరు ప్రక్కన కూర్చొనివున్న డాక్టరు కూతురు నేత్రాలు అశ్రుపూరితాలయ్యాయి. డాక్టరు కూతురితో ఆమె ''అమ్మా నువ్వూ అత్తగారింటికేనా పోవడము. నాకు వున్న కొద్ది అనుభముతో ఎన్నో విషయాలు గ్రహించాను. మళ్ళీ మంచిరోజులు వస్తాయని ఆశిస్తున్నాను.'' అన్నది. నిశ్చింతగా రైలు ముందుకు పరిగెత్తిపోతున్నది. నా ఆలోచనలు మరీ త్వరగా పరుగెత్తుతున్నాయి. నిజంగా ఎంత వింతగా వుందీ సంఘము.

...తరువాత ఒక సంవత్సరమునకు నేను గూడూరు స్టేషన్‌లో అటూ ఇటూ తిరుగుతుంటే ఇంతలో మా Class mate మోహన్ కనిపించాడు. ''ఏ మోయి మోహన్ ఏమిచేస్తున్నావు ఇప్పుడు.'' మా ఊరిలో School లో పని చేస్తున్నానన్నాడు. నీవు ఎక్కడకి పోతున్నావు ఏంచేస్తున్నావని మోహన్ అడిగాడు. తను మద్రాసులో పని చేస్తున్నాననీ, తిరుపతికి పోతున్నానన్నాడు. మోహన్ నవ్వుతూ నేను '' Family తో తిరుపతికి పోతున్నాను. Waiting Room కు రమ్మ''న్నాడు. ఆ నాడు నేను రైల్లో చూచినది మోహన్ భార్య అని, వాళ్ల కొడుకుతోకూడా తిరుపతికి వస్తున్నారని తెలిసికొని ఆనందించా. వాళ్ల వల్ల నా తిరుపతి ప్రయాణము ఆనందముగా సాగింది.


# కుష్టు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స :—
క్యాటలాగు ఉచితము.

భాస్కర తైలము:- సర్వనొప్పులకు, కర్ణరోగములకు, దెబ్బలకు, తెగవులకు, పుండ్లకు, విషజంతువుల కాట్లకు, కలరా, ఋతుశూలలు వగైరా అన్ని స్త్రీవ్యాధులకు గ్యారంటీగా పనిచేయును. సీసా వెల రు 2-0-0 లు. పూర్తి వివరములకు :

## జి వి. రెడ్డి అండ్ కో (రిజిష్టర్డు)

"భాస్కరాశ్రమము", గోపాలపురం, తూర్పుగోదావరిజిల్లా.